క్లుప్తంగా

భావనారాయణుని ఆదాయం రూ.5.63 లక్షలు



హుండీ సొమ్ము లెక్కిస్తున్న దేవదాయ శాఖ అధికారులు

కాకినాడ రూరల్: సర్పవరం రాజ్యలక్ష్మీ సమేత భావనారాయణ స్వామి ఆలయంలో హుండీలను మంగళవారం దేవదాయ, ధర్మదాయ శాఖ అధికారులు లెక్కించారు. ఆలయ ఈఓ భీమశంకరరావు ఆధ్వర్యంలో అర్చకులు, ఆలయ కమిటీ, భక్తుల సమక్షంలో హుండీలు లెక్కించగా రూ.5,63,490 ఆదాయం లభించింది. మాఘమాసం సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో దర్శనాలకు రావడంతో నెల రోజులు హుండీ ద్వారా ఆదాయం రూ.5.63 లక్షలు లభించిందని ఈఓ తెలియజేశారు. హుండీల లెక్కింపును ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ ఫణికుమార్, దేవాలయం వీధి శివాలయం ఈఓ వాసు, ఆలయ కమిటీ చైర్మన్ పుల్ల నారాయణరావు, సభ్యులు జోకా సత్తిబాబు, ఘంటసాల బద్రీనారాయణ, శీలం అప్పారావు, పంచాయతీ వార్డు సభ్యులు ఘంటసాల సతీష్, పుల్ల ధర్మరాజు, అయ్యన్న తదితరులు పాల్గొన్నారు.

ధ్యానంతో మానసిక ప్రశాంతత



ధ్యాన శిక్షణ శిబిరంలో మాట్లాడుతున్న రాజ్యలక్ష్మి

కాకినాడ రూరల్: ధ్యానంతో మానసిక ప్రశాంతత లభిస్తుందని ధ్యాన శిక్షకురాలు తటవర్తి రాజ్యలక్ష్మి పేర్కొన్నారు. రమణయ్యపేటలో విశ్వకాంతి పిరమిడ్ ధ్యాన మందిరం ఆధ్వర్యంలో జరుగుతున్న ధ్యాన శిక్షణ శిబిరంలో ఆమె మాట్లాడుతూ ఆలోచనలను పరిశీలించి, శోధించడమే ధ్యానమని, మనసు నైపుణ్యం పెంచే గొప్ప సాధనంగా పనిచేస్తుందన్నారు. అడబాల స్వర్ణలత మాట్లాడుతూ ప్రతి నెలా ఒకటో తేదీన ధ్యాన శిక్షణ తరగతులు నిర్వహిస్తామన్నారు.

వసతిగృహం తనిఖీ



వసతులు, సదుపాయాలపై అడుగుతున్న మేజిస్ట్రేట్ ఉషాలక్ష్మీ కుమారి

కాకినాడ లీగల్: కాకినాడ డైరీఫాం సెంటర్ సమీపంలో ఉన్న ప్రభుత్వ బీసీ బాయ్స్ హాస్టల్‌ను కాకినాడ స్పెషల్ మొబైల్ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ ఎస్.ఉషా లక్ష్మీ కుమారి మంగళవారం తనిఖీ చేశారు. విద్యార్థినులకు కల్పించిన వసతులు, సదుపాయాలను స్వయంగా న్యాయమూర్తి పరిశీలించారు.

మహిళాభివృద్ధికి పనిచేయాలి



మహిళా సంఘ నాయకులకు కేక్ తినిపిస్తున్న రాయవరపు సత్యభామ

బోట్‌క్లబ్: మహిళల ఆర్థిక పురోగతి కోసం మహిళా సంఘాలు పని చేయాలని రాయవరపు సత్యభామ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ రాయవరపు సత్యభామ అన్నారు. స్థానిక తోట సుబ్బారావునగర్‌లో రాయవరపు సత్యభామ చారిటబుల్ ట్రస్ట్, శివశక్తి మహిళా సంఘం వార్షికోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్‌చేసి మహిళలకు తినిపించారు. సత్యభామ మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు మహిళా సంఘాలు కృషి చేయాలన్నారు. శివశక్తి మహిళా సంఘం నాయకురాలు రాజకుమారి, పద్మ మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారన్నారు. పురుషులతో సమానంగా రాజకీయాల్లో సైతం ముందుంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ముంజులూరి అనంతలక్ష్మి, గంగాభవాని, దుర్గాడ కుమారి, వంకా వరలక్ష్మి, కామేశ్వరి, మజోజ్ఞ, పద్మ, అనుష, మణి, లావణ్య, స్వాతి తదితరులు పాల్గొన్నారు.

శిశుగృహకు మగ శిశువు

కాకినాడ సిటీ: ఈనెల 13న సర్పవరం జంక్షన్‌లోని బోట్‌క్లబ్ వద్ద గుర్తు తెలియని వ్యక్తులు వదిలి వెళ్లి మగ శిశువును జీజీహెచ్‌లో 10 రోజుల చికిత్స అనంతరం జిల్లా స్త్రీ, శిశు అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నడుస్తున్న శిశుగృహకు మంగళవారం తరలించినట్లు ఆ శాఖ అధికారిణి కె.ప్రవీణ తెలిపారు. ఈ బాబు తల్లిదండ్రులుగాని, రక్త సంబంధీకులు గాని 30 రోజులలో తగిన ఆధారాలతో తమను సంప్రదించవచ్చన్నారు. లేని పక్షంలో చట్టబద్ధంగా దత్తత ఇవ్వడం జరుగుతుందని ప్రవీణ తెలిపారు.

వాననీటి బురదకు చెక్

- జేఎన్‌టీయూకేలో చురుగ్గా సీసీ రోడ్లు
- పదిహేనేళ్ల సమస్యకు మోక్షం
- హర్షం వ్యక్తంచేస్తున్న అధ్యాపక, విద్యార్థి సంఘాలు



జేఎన్‌టీయూ ఆవరణలో కొత్తగా నిర్మించిన సీసీ రోడ్లు

బాలాజీచెరువు: విద్యార్థులకు విద్యతో పాటు, మౌలిక సదుపాయాలు పూర్తి స్థాయిలో ఉన్నప్పుడే ఉత్తమ ఫలితాలు ఆశించవచ్చు. జేఎన్‌టీయూకే ఏర్పాటై పదిహేను సంవత్సరాలు పూర్తవుతున్నా దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న సమస్యకు ఫుల్ స్టాప్ పడింది. ముగ్గురు వీసీలు పనిచేసినా ప్రధాన సమస్యపై దృష్టి సారించలేదు. ఆర్థిక వనరులు ఉన్నా ప్రణాళికలు, సలహాలు, సూచనలు ఇచ్చే అధికారులు ఉన్నా వాటిని పరిగణలోకి తీసుకోకుండా అప్పటి వీసీలు కాలయాపన చేశారు. శంకుస్థాపనలు వంటి వాటితో సరిపెట్టారే తప్ప అడుగు కూడా ముందుకు పడలేదు. నిధులు పుష్కలంగా ఉన్నప్పటికీ ప్రధానంగా ఉన్న డ్రైనేజీపై స్పందించలేదు. కొద్దిపాటి వర్షం వస్తే వర్సిటీ చెరువును తలపించేది. ఇదే ఆవరణలో హాస్టల్ ఉండడంతో అక్కడ నుంచి తరగతులకు నడిచి వెళ్లడానికి విద్యార్థులు నానా అవస్థలు పడేవారు. వర్షాకాలం అయితే ఈ సమస్య మరింత వర్ణనాతీతం. నగర నడిమధ్యలో దాదాపు 70 ఎకరాల పైబడిన విస్తీర్ణంలో ఉన్న వర్సిటీలో వర్షాకాలం వస్తే సమస్యలు చెప్పనక్కర్లేదు. అధ్యాపకులతో పాటు దాదాపు 2 వేల మంది విద్యార్థులు, 700 మంది బోధనేతర సిబ్బందితో పాటు వివిధ పనులపై వర్సిటీకు అనుబంధ కళాశాలల జిల్లాల నుంచి వచ్చే వారు చెరువులా తలపించే వర్సిటీ ప్రాంగణంలో అనేక అవస్థలు పడేవారు. అలాగే వర్సిటీ ఆవరణలోని అధ్యాపకుల క్వార్టర్ల వద్ద నీరు నిలిచిపోవడంతో దోమల సమస్యతో నిత్యం నరకం అనుభవించేవారు. నాగావళి మహిళ హాస్టల్స్, పోస్టల్ కార్యాలయం పక్కన ఇలా ప్రతి ప్రాంతం నీటితో నిలిచిపోయి వర్షం పోయిన పదిహేను రోజుల వరకూ నీరు నిల్వ ఉండిపోయేది. దాదాపు 25 ఏళ్ల పాటు ఇదే కళాశాలలో ప్రొఫెసర్ స్థాయి నుంచి వివిధ బాధ్యతలు చేపట్టిన జీవీఆర్ ప్రసాదరాజు ఉన్నత స్థాయి అధికారులతో పలు మార్లు సంప్రదించి దీనిపై దృష్టి సారించి దాదాపు రూ.20 కోట్లతో రోడ్లు డ్రైనేజీలకు ప్రతిపాదనలతో పాటు టెండర్ల ప్రక్రియ నుంచి వెంటనే పూర్తి పనులు పూర్తి చేసేలా ప్రత్యేక శ్రద్ధ వహించారు.

సంతోషంగా ఉంది



ప్రధాన సమస్యకు మోక్షం కలగడంతో చాలా సంతోషంగా ఉంది. వర్సిటీలో ప్రధాన సమస్య డ్రైనేజీ, రోడ్ల ఏర్పాటుపై నిర్ణయం తీసుకోవడంతో పాటు వాటిని ప్రతివారం సమీక్షించి పూర్తిచేసేలా ఇంజినీరింగ్ అధికారుల సహకారంతో పూర్తిచేస్తున్నాం. ఏప్రిల్ నెలఖారు నాటికి పూర్తిచేసేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటాను.

– డాక్టర్ జీవీఆర్ ప్రసాద్‌రాజు, వీసీ, జేఎన్‌టీయూకే

వైఎస్సార్ సీపీలో భారీగా చేరిక



రమణయ్యపేట క్యాంపు కార్యాలయం వద్ద వైఎస్సార్ సీపీలో చేరిన కాకినాడ ఎక్స్ సర్వీస్ మెన్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు కెనడీ, టీడీపీ నుంచి చేరిన పెనుమర్తి గ్రామస్తులతో ఎమ్మెల్యే కన్నబాబు తదితరులు

కాకినాడ రూరల్: రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాల అమలు, ఎమ్మెల్యే కురసాల కన్నబాబు చేపడుతున్న అభివృద్ధి పనులకు ఆకర్షితులై కాకినాడ ఎక్స్ సర్వీస్ మెన్ వెల్ఫేర్ అసోసియేషన్ నుంచి వైఎస్సార్ సీపీలో పలువురు చేరారు. రమణయ్యపేట వైద్య నగర్‌లో ఎమ్మెల్యే కన్నబాబు సమక్షంలో కాకినాడ ఎక్స్ సర్వీస్ మెన్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్ఎఫ్‌జే కెనడీ, జనరల్ సెక్రటరీ కేజే విక్టర్, ఆర్గనైజింగ్ సెక్రటరీ సీహెచ్ త్రివిక్రమ రావు (త్రినాథ్), జాయింట్ సెక్రటరీ ఎస్.తమ్మారావు, కోశాధికారి ఎంబీవీ గోపాల్, సభ్యులు వైఎస్సార్ సీపీలో చేరారు. వీరందరికీ పార్టీ కండువాలు వేసిన కన్నబాబు సాదరంగా ఆహ్వానించి, తమపై నమ్మకంతో వైఎస్సార్ సీపీలో చేరినందుకు ధన్యవాదాలు తెలియజేశారు. అలాగే కాకినాడ రూరల్ మండలం పెనుమర్తి గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు పెంకే వీరబాబు, వీర వెంకట సత్యనారాయణ, పిల్లి సూరిబాబు, పెంకే శ్రీనివాసరావు, వాసంశెట్టి రాజు తదితరులు 50 మంది ఆ గ్రామ సర్పంచ్ పెంకే ఆనందరావు ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీలో చేరారు. వీరికి పార్టీ కండువాలను ఎమ్మెల్యే కన్నబాబు వేసి సాదరంగా ఆహ్వానించారు.

పన్ను వసూళ్లపై దృష్టిపెట్టండి



సమీక్షిస్తున్న ఏడీసీ నాగనరసింహారావు



హాజరైన ఆర్వోలు, ఆర్ఐలు, అడ్మిన్లు

- నూరుశాతం లక్ష్యం సాధించాలి
- ఏడీసీ నాగనరసింహారావు ఆదేశం

కాకినాడ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగింపు దగ్గర పడుతున్నందున పన్నుల వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలని నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు ఆదేశించారు. స్థానిక స్మార్ట్‌సిటీ కార్యాలయంలో రెవెన్యూ అధికారులు, ఆర్ఐలు, సచివాలయ అడ్మిన్లతో మంగళవారం సాయంత్రం పన్నుల వసూళ్లపై ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బకాయిలపై వడ్డీ రాయితీ ఈ నెల 31వ తేదీతో ముగియనున్నందున పన్ను చెల్లింపుదారుల నుంచి బకాయిలు వసూలయ్యేలా చొరవ తీసుకోవాలన్నారు. ఇంటి పన్నులతో పాటు కుళాయి పన్నులపై కూడా దృష్టిపెట్టాలని ఆదేశించారు. రూ.7 కోట్ల ఆస్తి పన్ను, రూ.5 కోట్లు కుళాయి పన్నులు వసూలు కావాల్సి ఉందని చెప్పారు. వీటన్నింటినీ నూరుశాతం వసూలు చేసేలా సంబంధిత ఆర్వో, బిల్ కలెక్టర్, సచివాలయ అడ్మిన్లు చొరవ తీసుకోవాలన్నారు. ప్రజలు కూడా వడ్డీరాయితీని సద్వినియోగం చేసుకుని పన్నులు చెల్లించాలని సూచించారు. ప్రజలు చెల్లించే పన్నులతోనే అభివృద్ధి ముడిపడి ఉంటుందని, అందువల్ల సకాలంలో పన్నులు చెల్లించి సహకరించాలని కోరారు. సమావేశంలో డిప్యూటీ కమిషనర్ గుంటూరు శేఖర్, రెవెన్యూ అధికారులు చెక్కా రమణ, నిర్మల, ఆర్ఐలు, అడ్మిన్లు పాల్గొన్నారు.

నామినేషన్ డిపాజిట్‌గా పది రూపాయల నాణేలు



నామినేషన్ డిపాజిట్‌గా ప్లేటులో పది రూపాయల నాణేలను తీసుకు వచ్చిన అభ్యర్థి రామదాస్

యానాం: పుదుచ్చేరి ఏకైక లోక్‌సభ స్థానానికి వచ్చే నెల 19న ఎన్నికలు నిర్వహించనున్న నేపథ్యంలో ఈ నెల 20 నుంచి నామినేషన్ల పర్వం ప్రారంభమైంది. నామినేషన్ల ప్రకియలో మంగళవారం ఓ ఆసక్తికర ఘటన చోటుచేసుకుంది. రామదాస్ అనే ఇండిపెండెంట్ అభ్యర్థి పుదుచ్చేరి కలెక్టర్ కార్యాలయానికి చేరుకుని తన నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారి ఎ.కులోతుంగన్‌కు అందజేశారు. నామినేషన్ ధరావత్తు సెక్యూరిటీ డిపాజిట్‌గా చెల్లించాల్సిన రూ.12,500 సొమ్మును పది రూపాయల నాణేల రూపంలో పెద్ద ప్లేటులో తీసుకొచ్చి అందించారు. దీంతో ఎన్నికల సిబ్బంది ఆ నాణేలను లెక్కించి తీసుకున్నారు. ఇండిపెండెంట్‌గా నామినేషన్ దాఖలు చేసిన రామదాస్ ఓ లిక్కర్ షాపులో క్యాషియర్‌గా పనిచేస్తున్నారు. ఇటీవలి పది నాణేలను తీసుకోకుండా పలు చోట్ల తిరస్కరిస్తున్నారని, దీనిపై ప్రజల్లో చైతన్యం తీసుకురావాలనే ఆలోచనతోనే అలా చేసినట్లు ఆయన తెలిపారు.

ఆరో తేదీ నుంచి విద్యార్థులకు పరీక్షలు

సామర్లకోట: ఒకటి నుంచి 9వ తరగతి వరకు ఉన్న విద్యార్థులకు ఏప్రిల్ ఆరో తేదీ నుంచి పరీక్షలు ప్రారంభం కానున్నాయని ఎంఈఓ–2 పి.పుల్లయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒకటి నుంచి 8వ తరగతి విద్యార్థులకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, 9వ తరగతి విద్యార్థులకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12.15 వరకు పరీక్ష ఉంటుందన్నారు. ఒకటి నుంచి ఐదో తరగతి విద్యార్థులకు ఏప్రిల్ 16తో పరీక్షలు పూర్తి అవుతాయని, మిగిలిన విద్యార్థులకు 19 వరకు పరీక్షలు ఉంటాయని తెలిపారు.

వైఎస్సార్ సీపీలో గొరకపూడి చేరిక



ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరిన చిన్నయ్యదొర

సామర్లకోట: భారతమాత సేవా పరిషత్తు వ్యవస్థాపక అధ్యక్షుడు, ఉమ్మడి రాష్ట్ర మున్సిపల్ కౌన్సిల్ చాంబర్ మాజీ అధ్యక్షుడు, జై భారత్ జాతీయ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు గొరకపూడి చిన్నయ్యదొర మంగళవారం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో పెద్దాపురం వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి దవులూరి దొరబాబు ఆధ్వర్యంలో మంగళవారం పార్టీలోనికి వచ్చిన వారికి సీఎం పార్టీ కండువా వేసి అభినందించారు. పేద ప్రజలకు జరుగుతున్న మేలును దృష్టిలో ఉంచుకుని పార్టీలోనికి చేరుతున్నట్లు గొరకపూడి చిన్నయ్యదొర సీఎంకు చెప్పారు. నియోజకవర్గంలో దొరబాబును అత్యధిక మెజార్టీతో గెలిపిస్తామని గొరకపూడి హామీ ఇచ్చారు.

వేసవి క్రీడా శిబిరాలకు దరఖాస్తుల ఆహ్వానం

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): జిల్లా క్రీడాప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో మే 1 నుంచి 31 వరకు గ్రామీణ, అర్బన్ ప్రాంతాల్లో వివిధ క్రీడాంశాల్లో శిక్షణ శిబిరాల నిర్వహణకు అర్హులైన కోచ్‌లు, సీనియర్ క్రీడాకారుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఎస్‌డీఓ బి.శ్రీనివాస్ కుమార్ మంగళవారం తెలిపారు. కనిష్ఠంగా 20 మంది బాలురు, 20 మంది బాలికలతో ఈ శిబిరాలు నిర్వహించాలన్నారు. జిల్లాలోని క్రీడా సంఘాల ప్రతినిధులు, పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు, సీనియర్ క్రీడాకారులు తమ దరఖాస్తులు ఏప్రిల్ 2వ తేదీలోపు కాకినాడ జిల్లా క్రీడాప్రాధికార సంస్థ కార్యాలయంలో సమర్పించాలని, వివరాలకు 89196 42248 నెంబరులో సంప్రదించాలని కోరారు.

పంటలకు నీరందించాలి

కాకినాడ సిటీ: తాళ్లరేవు మండలం పి.మల్లవరం చిన్న తిప్ప గ్రామంలో 30 రోజులుగా పంట పొలాలకు సాగునీరు అందక వరి పంట ఎండిపోతుందని రైతులు మంగళవారం జిల్లా కలెక్టర్ కృతికా శుక్లాకు ఫిర్యాదు చేశారు. పంట పొలాలు ఈనిక దశలో ఉన్నాయని, నీరు లేక ఎండిపోతున్నాయన్నారు. పంట నష్టపోకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. కలెక్టర్ ఇరిగేషన్ అధికారులతో మాట్లాడి నీరు అందేలా చర్యలు తీసుకుంటామని రైతులకు వివరించారు. రైతులు డేవిడ్ రాజు, కేవీవీ సుబ్బారావు, అప్పారావు, శివ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ రాష్ట్ర కార్యదర్శిగా ఏసుదాసు

కాకినాడ రూరల్: తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా నియోజకవర్గ నేత వాసురెడ్డి ఏసుదాసు నియమితులయ్యారు. టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు ఆయనను నియమించారు.



విందుకు ముందు ప్రార్థన చేస్తున్న ఎమ్మెల్యే ద్వారంపూడి, మత పెద్దలు

ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే ద్వారంపూడి

కాకినాడ: కాకినాడ జగన్నాథపురం చినమార్కెట్ సమీపంలో అక్బర్ మసీదులో మంగళవారం సాయంత్రం జరిగిన ఇఫ్తార్ విందుకు ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి హాజరయ్యారు. అక్కడి ముస్లిం ప్రతినిధులకు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. అక్బర్ మసీదు అధ్యక్షుడు షేక్ బబ్లు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ద్వారంపూడి వెంట జేసీఎస్ కన్వీనర్ సుంకర విద్యాసాగర్, మాజీ కార్పొరేటర్ ఎంజీకే కిశోర్, ఉభయగోదావరి జిల్లాల మైనార్టీ సెల్ జోనల్ ఇన్‌చార్జి అబ్దుల్ బషీరుద్దీన్, జిల్లా మైనారీ సెల్ అధ్యక్షుడు బాషా, నగర మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఖాలీద్‌బిన్ వలీ, జిల్లా వక్ఫ్‌బోర్డు అధ్యక్షుడు రెహ్మాన్‌ఖాన్, జిల్లా కార్యదర్శి కరీం, జిల్లా సంయుక్త కార్యదర్శి అబ్దుల్ రహీంతో పాటు పెద్ద సంఖ్యలో ముస్లిం ప్రతినిధులు పాల్గొన్నారు. ఇఫ్తార్ విందు సందర్భంగా జోనల్ ఇన్‌చార్జి బషీర్ మాట్లాడుతూ నగరంలో మసీదుల అభివృద్ధికి, ముస్లిం మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం చేసిన కృషిని వివరించారు.

ఎన్నికల నిబంధనలు మీరొద్దు

- కాకినాడ రూరల్ ఆర్వో కిశోర్
- రాజకీయ పార్టీల ప్రతినిధులకు పిలుపు



రాజకీయ ప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతున్న ఆర్వో కిశోర్, డీఎస్పీ హనుమంతరావు

కాకినాడ రూరల్: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులో ఉన్నందున నిబంధనల మేకు కార్యకలాపాలు నిర్వహించుకోవాలని రాజకీయ పార్టీల ప్రతినిధులను నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఇట్ల కిశోర్ కోరారు. సర్పవరం జంక్షన్ వద్ద ఆర్వో కార్యాలయంలో మంగళవారం రాజకీయ పార్టీ ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఎన్నికల ప్రచార ర్యాలీలు, బహిరంగ ప్రదేశాలలో నిర్వహించే సమావేశాలకు రాజకీయ పార్టీలు ముందుస్తు అనుమతి తీసుకోవాలన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవన్నారు. అనుమతులకు సువిధ యాప్ ద్వారా కానీ నేరుగా రిటర్నింగ్ అధికారి కార్యాలయం నుంచి గాని దరఖాస్తు చేసుకుని పొందాలని సూచించారు. ఇంటింటి ప్రచారానికి కూడా తప్పక అనుమతులు తీసుకోవాలన్నారు. రాజకీయ పార్టీలు దరఖాస్తు చేసిన 48 గంటల్లో అనుమతులు మంజూరు అవుతాయన్నారు. నియమావళికి లోబడి ప్రచారం చేసుకోవాలన్నారు. డీఎస్పీ డాక్టర్ కె.హనుమంతరావు మాట్లాడుతూ శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా ప్రచారం చేసుకోవాలన్నారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ ప్రతినిధులు రావూరి వెంకటేశ్వరరావు, గదుల సాయిబాబా, జనసేన అభ్యర్థి పంతం నానాజీ, టీడీపీ ప్రతినిధి కృష్ణమూర్తి, తదితరులు పాలొన్నారు.

నగదు పరిమితి రూ.50 వేలు



రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతున్న రిటర్నింగ్ అధికారి వెంకటరావు

- అదనంగా ఉంటే ఆధారాలు తప్పనిసరి
- ఈఆర్వో వెంకటరావు
- రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం

కాకినాడ: ఎన్నికల నేపథ్యంలో ఏ ఒక్కరూ రూ.50 వేలకు మించి నగదు కలిగి ఉండరాదని నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి జె.వెంకటరావు స్పష్టం చేశారు. అంతకు మించి సొమ్ము ఉంటే తగిన ఆధారాలు తప్పనిసరిగా చూపించాలన్నారు. స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయంలో మంగళవారం సాయంత్రం రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశం జరిగింది. సమావేశంలో ఎన్నికల ప్రవర్తన నియమావళిని వివరించారు. ఈ సందర్భంగా ఆర్వో మాట్లాడుతూ పరిమితికి మించిన నగదుకు తగిన ఆధారాలు చూపించకపోతే ఆ సొమ్మును స్వాధీనం చేసుకుంటామని చెప్పారు. కోడ్ ఆఫ్ కాండక్ట్ అమలుకు అన్ని రాజకీయ పక్షాలు సహకరించాలని ఆయన కోరారు. అప్పుడే ఎన్నికలు సజావుగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించే వీలుంటుంద అన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళిని ఉల్లంఘిస్తే తగిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. రావూరి వెంకటేశ్వరరావు (వైఎస్సార్ సీపీ), తుమ్మల రమేష్ (టీడీపీ), అప్పారావు (బీఎస్పీ), డిప్యూటీ తహసీల్దార్ సీతాపతి రావు, డీసీపీ హరిదాస్, ఏసీపీ నాగశాస్త్రులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

రజకుల సమస్యలు పరిష్కరించాలి

కాకినాడ సిటీ: రజకులు సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా చాలా వెనుకబడి ఉన్నారని, 77 ఏళ్లుగా అనేక సమస్యలతో రజకులు ఇబ్బందులు పడుతున్నారని వీరి సమస్యలు తీర్చాలని ఏపీ రజక వృత్తి దారుల సంఘం జిల్లా సమావేశం డిమాండ్ చేసింది. మంగళవారం కాకినాడ సుందరయ్య భవన్‌లో నిర్వహించిన సంఘం సమావేశంలో పలువురు వ్యక్తులు మాట్లాడారు. వృత్తి నిర్వహణలో యంత్రాలు ప్రవేశించినందున ఉపాధికి గండిపడే అవకాశం ఉందన్నారు. రజక వృత్తిదారులకు స్టీమ్ ఐరన్ ఇస్త్రీ చేసేందుకు 250 యూనిట్లు ఉచిత కరెంటు ఇవ్వాలన్నారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ప్రభుత్వ సంస్థలు, దేవస్థానాల్లో ఉన్న రజక వృత్తి ఉపాధిని రజక యువతీ యువకులకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రజక వృత్తి చెరువులు, కుంటలు స్థలాల పైన రజకులకే పూర్తి హక్కు కల్పించాలని, 50 ఏళ్లు పూర్తయిన రజకులకు వృద్ధాప్య పెన్షన్లు ఇవ్వాలన్నారు. ఈ సమావేశంలో రజక సంఘం నాయకులు కోనేటి రాజు, కొజ్జవరపు మాణిక్యం, కె.త్రిమూర్తులు, వి.రాజు, ఎస్.రాజేష్, సీహెచ్ శ్రీను, గంగాధరరావు తదితరులు పాల్గొన్నారు.